అక్రమ నిర్మాణాలపై కొరడా!

- మా భూములే అంటున్న టీఎన్‌జీవోస్..
- ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయంటున్న అధికారులు


ఇటీవల నిర్మాణం చేపట్టిన ఇళ్లను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

లక్సెట్టిపేట: మండల కేంద్రంలో అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గత కొద్ది సంవత్సరాల నుంచి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు ఇష్టారాజ్యంగా వెలిశాయి. అధికారులు కొన్ని ఇళ్లను కూలగొట్టి, మరికొన్ని నిర్మాణాలను అలాగే ఉంచడంపై కొంతమంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు అని రెవెన్యూ అధికారులు అంటున్నా, టీఎన్‌జీవోలు మాత్రం మా భూములు అంటున్నారు.

టీఎన్‌జీవో స్థలాలపై కొరడా..

మండల కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీ సమీపంలో 1982వ సంవత్సరంలో ప్రభుత్వం టీఎన్‌జీవోలకు సర్వే నంబర్ 375లో ఆరు ఎకరాల భూమిని ఇళ్ల స్థలాల కోసం 92మందికి కేటాయించింది. టీఎన్‌జీవోలు ఆ ప్రదేశంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రదేశం నిర్మానుష్యంగా మారింది. గతకొద్ది సంవత్సరాల నుంచి ఆ ప్రదేశంలో కొంతమంది అనుమతులు లేకుండా, మరికొందరు ఇతరుల పేరుమీద అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఆ స్థలం ప్రభుత్వం భూమి అని, ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని పలుమార్లు తెలిపినా ప్రదేశం మొత్తం ఇళ్లు వెలిశాయి. ఇటీవల పలు పార్టీల నాయకులు వాటిపై దృష్టిపెట్టి అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందించడంతో, రెవెన్యూ అధికారులు వాటిపై దృష్టిపెట్టి నిర్మాణాలను కూల్చివేశారు. పక్కా భవనాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, కేవలం నిర్మిస్తున్న వాటిని మాత్రమే కూల్చారని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇస్తున్నారు అనేది ప్రశ్నగా మిగిలింది. ఎన్‌జీవోలు నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, ఆ భూమిలో నిర్మాణాలు చేపట్టొద్దని రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. సంబంధిత అధికా రులు ఆ సర్వే నంబరులో ఉన్న ఇళ్లకు ఎవరు అనుమతులు ఇచ్చారు, అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు



టీఎన్‌జీవోలకు ఇచ్చిన భూముల్లో అక్రమంగా, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇటీవల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని అంటున్నారు. కానీ పూర్తిస్థాయిలో ఇళ్లను కూలగొట్టడం లేదు. స్థలం అంతా కబ్జాకు గురైంది. అధికారులు పట్టించుకోవడం లేదు. చాలా మంది పేదలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రభుత్వ భూమిని పేదలకు అందించాలి.

– దొంద ప్రభాకర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

చర్యలు తీసుకుంటాం



గతంలో టీఎస్ జీవోలకు ఆ భూమిని కేటాయించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనంలో ఉన్నది. ఇటీవల కొందరు నిర్మాణాలు చేపడుతున్నారని తెలియడంతో కూలగొట్టాం. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాఘవేంద్ర రావు, తహసీల్దార్, లక్సెట్టిపేట

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న శ్రేణులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్లు రత్నం ఐలయ్య, అడ్డూరి ఏక్‌నాథ్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద ఈ నెల 11న నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బేషరతుగా ఎస్సీ వర్గీకరణకు సంసిద్ధతను వ్యక్తం చేయాలని డిమాండ్ చేశారు. విశ్వరూప మహాసభకు మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మచ్చ రాజేశ్‌కుమార్, వినయ్, శ్రావణ్‌కుమార్, నిక్షిత్, రజినీ కాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

రామకృష్ణాపూర్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 11న హైదరాబాద్‌లో తలపెట్టిన మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభ పోస్టర్లను గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు పట్టణంలో ఆవిష్కరించారు. మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాచర్ల సరేష్, సంపత్, ఆగయ్య, పోచయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు, గుడుంబా స్థావరాలపై దాడులు

దహెగాం: ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు బెల్టు దుకాణాలు, గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నారు. గురువారం జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంతోపాటు దేవులగూడ, కమ్మర్‌పల్లిలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బండ సాగర్ వద్ద విక్రయించడానికి నిల్వ ఉంచిన మద్యం లభించిందన్నారు. మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి, దేవులగూడెం శివారులో 2500లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని పేర్కొన్నారు. మద్యం విక్రయించినా, గుడుంబా తయారు చేసినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గుంతలు పూడ్చండి సారూ..!

చెన్నూర్‌రూరల్: మండలంలోని దుగ్నెపల్లి గ్రామానికి వెళ్లే ప్రదాన రహదారిలో చెరువుకు ముందు ఏర్పాటు చేసిన రోడ్‌డ్యాంపై పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాత్రి వేళల్లోనైతే కింద పడి పోతున్నామని ద్విచక్రవాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని గుంతలు పూడ్చి వేయాలని కోరుతున్నారు.

'అభివృద్ధి కోసం జాన్సన్‌ను గెలిపించండి'


పూజలు చేస్తున్న జాన్సన్‌నాయక్ దంపతులు

ఖానాపూర్: నియోజకవర్గ అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి అన్నారు. గురువారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుంట్ల నారాయణరావు, పుప్పాల శంకర్, పూర్ణచందర్‌నాయక్, గోవింద్ తదితరులు ఉన్నారు.

జాన్సన్‌నాయక్ పూజలు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నామినేషన్ వేసేందుకు పార్టీ శ్రేణులతో కలిసి ఉట్నూర్‌కు వెళ్లారు. తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన మైనార్టీ నాయకులు

ఖానాపూర్: మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ముఖ్య అనుచరుడు జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ చాంద్‌పాషాతోపాటు మైనార్టీ నాయకుడు అనీస్ అహ్మద్‌ఖాన్ బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం పట్టణంలోని ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపల్లి రవీందర్‌రావు నివాసంలో ఎమ్మెల్సీ దండె విఠల్ వారికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని.. ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ గెలుపునకు కృషి చేయాలని పేర్కొన్నారు.

సర్వసభ్య సమావేశం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈ నెల 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు హాజరుకావాలని తెలిపారు.

'పది' విద్యార్థులకు అభ్యాస దీపికలు


అభ్యసన పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో

మంచిర్యాలఅర్బన్: పదిలో శతశాతం పెంపు లక్ష్యంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా బుధవారం మరోవైపు అభ్యాసన దీపికలు పంపిణీ చేశారు. ఆయా ఎమ్మార్సీలకు అభ్యాస దీపికల పుస్తకాలు చేరగా హెచ్‌ఎలకు అందజేశారు. జిల్లాలో 129పాఠశాలల్లో 12,065మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఒక్కో విద్యార్థికి గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక, జీవ, భౌతిక శాస్త్రాల సబ్జెక్టులకు సంబంధించి అభ్యాస దీపికలు అందజేయనున్నారు. వీటిలో మాదిరి ప్రశ్నపత్రాలతో పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నారు. లఘు, వ్యాసరూప, బహుళ, ఐచ్ఛిక ప్రశ్నలు, జవాబులు రూపొందించారు. వంద శాతం ఫలితాలకు పది విద్యార్థులకు అభ్యసన దీపికలు ఎంతో దోహదం చేస్తాయని ఎంఈవో పోచయ్య తెలిపారు.

పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్

తాండూర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా త్వరలో జరిగే పోలింగ్ సజావుగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అధికారులకు సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీని గురువారం సందర్శించారు. ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ రోజు వచ్చే అధికారులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని, ఎన్నికల రోజు ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఎంపీడీవో వెంట కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

దోమ పోటు.. వరికి చేటు

- వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు


నెన్నెల శివారులో సుడి దోమతో దెబ్బతిన్న వరి

నెన్నెల: గత కొంత కాలంగా రైతులను దురదృష్టం వెంటాడుతూనే ఉంది. సకాలంలో వర్షాలు కురవక, గిట్టుబాటు ధర లభించకపోవడం లాంటి కారణాల మూలంగా రైతులు ఎన్నో ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు వాతావరణంలో మార్పుతో మరింత నష్టపోతున్నారు. తాజాగా తెగుళ్లు అన్నదాతలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా దోమపోటు, ఎండు తెగులు వరి పంటను దెబ్బతీయడం రైతులను తీవ్రంగా వేధిస్తోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో 45వేల ఎకరాల్లో వరి పంట వేయగా, సుమారు 15 వేల ఎకరాల్లో వరి పంటను దోమ పోటు, ఎండుతెగులు సర్వనాశనం చేసినందుకు కర్షకుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఊహించని రీతిలో దోమ పోటు రైతులను నిండా ముంచింది. పంట చేతికి వచ్చే దశలోనే ఇలా జరగడంతో వారు ఎంతో కృంగిపోతున్నారు. దిగుబడి చాలా మట్టుకు తగ్గనున్నందునా ఏం చేయాలో తెలియక లబోదిబోమంటున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి రేయింబవళ్లు శ్రమించి సాగు చేసిన పంట, తమ కళ్ల ఎదుటే ఎందుకు పనికి రాకుండా తయారైందని తీవ్ర మనస్థాపానికి లోనవుతున్నారు. దోమ ఉధృతితో కళ్లముందే పంట పాడవుతుంటే రైతులు రకరకాల మందులు పిచికారీ చేసినా, దోమపోటు నివారణ సాధ్యం కావడం లేదు. సుడి దోమతో పడరాని పాట్లు పడుతున్నారు. రైతులు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పంట దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పంట పాడైపోయింది..



రెండు ఎకరాల్లో జైశ్రీరాం సన్నరకం సాగు చేశాను. దోమ పోటు సోకి పంట దెబ్బతింటోంది. చేతికంది వచ్చే సమయంలో దోమ పోటు రావడంతో రూ.60వేల పెట్టుబడి నేలపాలైంది. మందులు పిచికారీ చేసిన లభం లేకుండా పోయింది.

– అబ్బర్ల శ్రీను, రైతు(నెన్నెల)

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ప్రస్తుత వాతావరణంలో మార్పుల వల్ల వరి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. దోమ పోటు ఉన్న పొలాల్లో సరైన సమయంలో మందులు పిచికారీ చేయాలి. వరి పంటలో దోమపోటు నివారణకు మొదళ్ల వరకు మందు పడేలా చూసుకోవాలి. నివారణ కోసం టెకెన్, అప్లాడ్, గ్లామర్, ఎసిపేట్ లాంటి మందులను తగిన మోతాదులో వరి పంటపై పిచికారీ చేయాలి. తూర్పు, పడమర వరిలో కాలిబాటలు తీయాలి. – ప్రేమ్‌కుమార్, ఏఓ, నెన్నెల

అటెన్షన్ ప్లీజ్.. ట్రాఫిక్ సమస్యలు తీరేదెప్పుడో..?


రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియా ప్రాంతంలో ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలం లేకుండా పోయింది. షాపులకు వచ్చే వాహన చోదకులు బైక్‌లను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక అనివార్యంగా రోడ్డు మీద నిలిపి ఉంచాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ కారణంగా ట్రాఫిక్ సమస్యలను పురప్రజలు ఎదుర్కొంటున్నారు. రోడ్డుమీద, ఫుట్‌పాత్ మీద వాహనాలు పార్కింగ్ చేయకుండా ప్రత్యేకమైన స్థలాన్ని ఎంపిక చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రోజువారీగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా బైక్‌లకు పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

స్పందించాల్సిన అధికారి : బన్సీలాల్, ఎస్‌హెచ్‌ఓ, బెల్లంపల్లి వన్‌టౌన్
ఫోన్ నంబర్ : 87126 56559

క్లుప్తంగా

సబ్ జైలులో వైద్య శిబిరం



శిబిరంలో వైద్య సిబ్బంది

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సబ్ జైలులో ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి ఐసీటీసీ సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అండర్ ట్రయల్ ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఐవీ, టీబీ, సుఖవ్యాధులు, ఇతర సంబంధిత వ్యాధులపై పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, ఏమైనా ఇబ్బందులు, వ్యాధులు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాస్, జైలర్ స్వామి, వైద్య సిబ్బంది అనిల్‌కుమార్, ఆంజనేయులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు తదితరులు పాల్గొన్నారు.

దొనబండలో గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్


వ్యాక్సిన్ చేస్తున్న రమేశ్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు ఉచితంగా పీపీఆర్ వ్యాక్సినేషన్ చేశారు. ఈ సమయంలో మేకలు, గొర్రెలలో వచ్చే వ్యాధులకు సంబంధించి జరుపుతున్న వ్యాక్సినేషన్‌లో భాగంగా గ్రామంలోని 1,424గొర్రెలు, 262మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వై.రమేశ్ కుమార్, మండల పశువైద్యాధికారి ఈ.సరిత, వెటర్నరీ అసిస్టెంట్‌లు స్వప్న, రాకేశ్, గొర్రెలు, మేకల యజమానులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో గురువారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోనల్‌స్థాయి ఖోఖో, కుస్తీ క్రీడా పోటీల్లో కళాశాలకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ గౌతం రెడ్డి తెలిపారు. 200 మంది క్రీడాకారులు పాల్గొని, కళాశాల విద్యార్థులు ఉత్తమ ఖోఖో, కుస్తీ పోటీలో ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ క్రీడాకారులు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో క్రీడా కార్యదర్శి బాబురావు, పీడీ మల్లిక, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఓటరు అవగాహన కార్యక్రమం


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అంజయ్య మాట్లాడుతూ... 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ సోమయ్య, అధ్యాపకులు, అంబాసీడ ర్స్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి

పాతమంచిర్యాల: గోదావరి ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని, ముంపు వల్ల జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి.బాబన్న అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జనసమితి పార్టీ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించిందని తెలిపారు. కడెం ప్రాజెక్టుపై కుఫీ రిజర్వాయర్ చేయాలని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలని, మంచిర్యాల జిల్లాకు సాగు నీరందించాలని అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు రాంచందర్‌రెడ్డి, విద్యార్థి యువజన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ములేస్తోంది..!


పత్తి మొక్కలపై పేరుకుపోయిన దుమ్ము


వాహనం వెనుక లేస్తున్న దుమ్ము

భీమిని: కన్నెపల్లి మండలంలోని సబ్‌స్టేషన్ నుంచి వెంకటాపూర్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గుత్తేదారు వాటర్ క్యూరింగ్ చేయకపోవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము లేచి, వెనుకవైపు నుంచి వస్తున్న వాహనాలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు గమనించక ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ రోడ్డు ఇరువైపులా పత్తి చేలు ఉండటంతో దుమ్మువల్ల వాటి ఎదుగుదల లేక, పత్తి పంటలు పాడైపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు దుమ్ముతో పాటు కంకర ఉండటంతో జారిపడుతున్నారు. రోడ్డుకు వాటర్ క్యూరింగ్ చేసి, దుమ్ములేవకుండా చూసుకొని ప్రమాదాలు అరికట్టాలని వాహనదారులు పేర్కొంటున్నారు.

'అవినీతి పాలన అంతమొందించాలి'

జైపూర్: రాష్ట్రంలో అవినీతిపాలన సాగుతుందని, ఈ అవినీతి పాలనను ఓటర్లు ఓటు ద్వారా అంతమొందించాలని పీడీఎస్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినయ్‌రెడ్డి అవగాహన కల్పించారు. జైపూర్‌లో 'మేలుకో తెలంగాణ(జాగో)' కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు గురువారం అవగాహన కల్పించారు. ప్రజలు త్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణను, కేసీఆర్ ఆగం చేస్తున్నారని మండిపడ్డారు.